ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 105 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 25 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## నేపాల్‌లో కుప్పకూలిన విమానం

18 మంది మృతి

ప్రాణాలతో బయటపడ్డ పైలట్

2లో..

# కేటీఆర్ X రేవంత్ రెడ్డి

## అసెంబ్లీలో వాడీ వేడీ చర్చ





హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని రేవంత్ అన్నారు. కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు 'మాకు జవాబు చెప్పండి చాలు. మీకు కేసీఆర్ అవసరం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించడంతో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "తండ్రి పేరు చెప్పుకొని నేను మంత్రిని కాలేదు. కింది స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రిని అయ్యా. కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నా. అంతకంటే దారుణం" అని అన్నారు. ఆ వెంటనే కేటీఆర్ స్పందిస్తూ 'రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు' అని వ్యాఖ్యానించారు. దానికి రేవంత్ మళ్లీ కౌంటర్ ఇస్తూ 'పేమెంట్ కోటాలో సీఎంను కాలేదు. మొన్న భారాస నేతలు దిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకొని వచ్చారు' అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పందిస్తూ "మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని సీఎం అనొచ్చా? సభా

..మిగతా 2లో

## శాసనసభలో ఆర్టీసీపై వాడీవేడి చర్చ



2



## సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం

### కేసీఆర్ బాటలోనే..!

### నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తూ రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన కూడా.. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బాటలోనే నడిచేందుకు సిద్ధమయ్యారు. గతంలో కేంద్రానికి వ్యతిరేకంగా కేసీఆర్ ఎలాంటి పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారో.. అదే మార్గాన్ని రేవంత్ రెడ్డి ఎంచుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జులై 23న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి నిధులు కేటాయించకపోవటంపై.. అసెంబ్లీలో చర్చించారు. ఈ చర్చలో భాగంగా.. ఆయా పార్టీలు తమ అభిప్రాయాలను తెలపగా.. "కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం" తీర్మానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ తీర్మానానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలపగా.. బీజేపీ మాత్రం వాకౌట్ చేసింది.

ఈ సందర్భంగా.. సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ.. ఈ నెల 27న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకాకూడదని నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. అయితే.. ఈ నీతి ఆయోగ్ మీటింగ్‌ను తమిళనాడు సీఎం స్టాలిన్ బహిష్కరించగా తమ పార్టీకి చెందిన ముగ్గురు సీఎంలు దూరంగా ఉంటారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. బడ్జెట్ విషయంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, కేరళ సీఎం పినరయ్ విజయన్ అసంతృప్తి వ్యక్తం చేయగా.. వాళ్లు కూడా నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు అవుతారా లేదా అనేది మాత్రం ప్రకటన చేయలేదు. అయితే.. గతంలోనూ సీఎంగా ఉన్న కేసీఆర్.. తెలంగాణ పట్ల కేసీఆర్ కూడా ఇదే పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ సమావేశానికి మొదట్లో హాజరైన కేసీఆర్.. ఆ తర్వాత మళ్లీ హాజరుకాకపోవటం గమనార్హం. నీతి ఆయోగ్ సమావేశంలో పల్లీలు తింటూ సమావేశాన్ని వ్యర్థం చేస్తున్నారంటూ కామెంట్ చేశారు. కాగా.. ఇప్పుడు కూడా సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే పద్ధతిలో నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించటంతో.. కేంద్రంపై నిరసన వ్యక్తం చేసే విషయంలో కేసీఆర్ మార్గాన్నే ఎంచుకున్నారంటూ చర్చ నడుస్తోంది. మరోవైపు.. అసెంబ్లీలో చర్చ సమయంలో రేవంత్ రెడ్డికి హరీష్ రావు, కేటీఆర్‌కి మధ్య ఘాటుగానే మాటల తూటాలు పేలాయి. ఆ సందర్భంలోనే..

..మిగతా 2లో

## కేసీఆర్‌ను రమ్మనండి.. దీక్షకు నేను సిద్ధం

### సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): రాష్ట్రానికి నిధుల కోసం దిల్లీలో దీక్ష చేయాలని భారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు చేసిన డిమాండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకురావాలన్నారు. మీరే తారీఖు డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్ధం. తెలంగాణకు నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. "చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదు. అగ్గిపెట్టి మర్చిపోయినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై శాసనసభలో చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది.

### బడ్జెట్ ప్రసంగంలో అన్ని రాష్ట్రాల పేర్లనూ

## ప్రస్తావించలేం

### అలా అని విస్మరించినట్లేనా?

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, జులై 24 (ప్రభాత ఉదయం): తమ ప్రభుత్వ లక్ష్యాలను వివరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఆర్థిక ఏడాది 2024-25కి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. వరుసగా ఏడోసారి వార్షిక పద్దును ప్రవేశపెట్టిన ఆమె వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా అన్ని రంగాల్లో ఉద్యోగ,

..మిగతా 2లో



### అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో

## మారుతున్న సమీకరణాలు

2

### ట్రంప్‌ను వెనక్కి నెట్టిన కమలా హారిస్

### నేడు అసెంబ్లీకి

## మాజీ సీఎం కేసీఆర్



హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ జూలై 25న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవుతున్నట్లుగా బీఆర్ఎస్ ప్రకటించింది. అయితే అందుకు చాలా కారణాలు ఉన్నాయని తెలుస్తోంది.. మామూలు సమయాల్లో అసెంబ్లీ సమావేశాలకు హాజరైతే.. కాంగ్రెస్ పూర్తిగా కేసీఆర్‌ను టార్గెట్ చేసి విమర్శల వర్షం కురిపిస్తుందని బిఆర్ఎస్ అంచనా వేసి,మాజీ సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంచారని తెలుస్తోంది.. నిజానికి కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి పైగా తెలంగాణ ఉద్యమ నేతగా ఉన్న ఆయన అసెంబ్లీలో ఎలాంటి అవమానాలకు గురి కావొద్దు అనేది పార్టీ ఆలోచనగా కనిపిస్తోంది. ఇందుకోసమే చర్చలు ఉన్న రోజు కాకుండా.. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు కేసీఆర్ హాజరయ్యేలా బీఆర్ఎస్ పార్టీ ప్లాన్ చేసింది. బడ్జెట్ ప్రవేశపెట్టి రోజున ఎలాంటి చర్చలు ఉండవు కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ప్రవేశ పెడుతూ చేసే ప్రసంగం తప్ప ఇక ఎలాంటి ఇతర వ్యాఖ్యానాలు ఉండవు. అందుకోసమే ఈ రోజును అసెంబ్లీ హాజరయ్యేందుకు కేసీఆర్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంచుకున్నారని సమాచారం. అయితే ఆ తర్వాత కూడా కేసీఆర్ సమావేశాలకు రావడం కంటిన్యూ చేస్తారా.. లేదా అన్నది తేలాల్సి ఉంది.



### బడ్జెట్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో

### ఇండియా కూటమి

## నిరసన

న్యూఢిల్లీ, జులై 24 (ప్రభాత ఉదయం): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ 2024)పై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బుధవారం ఉదయం సమావేశాలకు ముందు కూటమి పార్టీలకు చెందిన ఎంపీలంతా పార్లమెంట్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ప్రవేశ పెట్టిన

..మిగతా 2లో

### హైదరాబాద్‌లో

## గాడిద గుడ్డు ఫ్లెక్సీలు

2

బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై వినూత్న రీతిలో నిరసన



# శాసనసభలో ఆర్టీసీపై వాడీవేడి చర్చ

హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): తెలంగాణ శాసనసభలో ఆర్టీసీపై వాడీవేడి చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై అధికారపక్షం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్.. ప్రతిపక్షం తరఫున భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. ఈ క్రమంలో అధికార విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "హరీశ్ రావు సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగానూ వ్యవహరించారు. ఆర్టీసీ కార్మికుల తరఫున మాట్లాడేందుకు సీపీఐ సభ్యుడికి సభాపతి అవకాశం ఇచ్చారు. ఆ పార్టీకి ఛాన్స్ ఇవ్వడాన్ని భారాస సభ్యుడు హరీశ్‌రావు ప్రశ్నించడం, స్పీకర్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రశ్న అడిగిన వారికే మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఎక్కడా లేదు. ఎవరికి ఇవ్వాలనేది స్పీకర్ విచక్షణ. ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ఉంది. ఒక కార్మిక నేతను తొలగించేందుకు సంఘాలనే గత ప్రభుత్వం రద్దు చేసింది. సభను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించవద్దని భారాస నేతలకు మనవి చేస్తున్నా" అని అన్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ "ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారు? ఆర్టీసీని ప్రభుత్వంలో ఎప్పుడు విలీనం చేస్తారు? విలీనంపై ఎప్పటిలోగా అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటిస్తారు?" అని ప్రశ్నించారు.

**ఆర్టీసీపై రాజకీయం చేస్తున్న భారాస: మంత్రి పొన్నం ప్రభాకర్**

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆర్టీసీ అంశాన్ని భారాస రాజకీయం చేస్తోందని వ్యాఖ్యానించారు. "యూనియన్లను రద్దు చేసి.. ఇప్పుడు పునరుద్ధరించాలని మాట్లాడుతున్నారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించుకోలేదు. ఆర్టీసీ సొమ్మును గత ప్రభుత్వం వాడుకుంది. ఆ సంస్థకు మేం నెలకు రూ.300 కోట్లు ఇస్తున్నాం. ఆర్టీసీకి కొత్త బస్సులు కొంటున్నాం. కొత్తగా 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నాం. పని భారం పెరిగినా ఆర్టీసీ కార్మికులు బాగా పని చేస్తున్నారు. వారిని అభినందిస్తున్నా. ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలను మేం చెల్లించాం. ఆర్టీసీ కార్మికులపై భారాస నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. వారి సంక్షేమం మా బాధ్యత" అని చెప్పారు.



# నేడు మేడిగడ్డకు భారాస బృందం

హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌస్‌ను భారాస పార్టీ బృందం క్షేత్రస్థాయిలో సందర్శించనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు భారాస నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్‌లోని ఎల్ఎండీ చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు లోయర్ మానేరు డ్యాంను సందర్శిస్తారు. రాత్రి కరీంనగర్‌లో భోజనం చేసి, రామగుండంలో బస చేస్తారు. రామగుండం నుంచి బయల్దేరి శుక్రవారం ఉదయం 9 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించి అనంతరం 10.30 గంటలకు మీడియాతో మాట్లాడుతారు. 11.30కు మేడిగడ్డ బ్యారేజీని సందర్శిస్తారు.

# కేటీఆర్ X రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

నాయకుడు అలా మాట్లాడొచ్చా?" అని ప్రశ్నించారు.

**పదేళ్ల భారాస పాలనలో రాష్ట్రం దివాలా: రేవంత్‌రెడ్డి**

ఆ తర్వాత మళ్లీ సీఎం రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేశారు. "మాకేమీ అక్కర్లేదు.. మీ ప్రేమ చాలని చెప్పిన మనిషి కేసీఆర్. విద్యుత్‌పై రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక విధానమే లేదు. రూ.7లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లిపోయారు. భారాస పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. గత ప్రభుత్వ పరిపాలనలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. మీరేం చేశారో చూశాకే ప్రజలు తీర్పు ఇచ్చారు. భారాసకు అసెంబ్లీలో వచ్చిన మెజారిటీ లోక్‌సభ ఎన్నికల్లో రాలేదు. లోక్‌సభలో గుండుసున్నా దక్కినా తీరు మారకుంటే ఎలా?ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం మాట్లాడాలని కోరుతున్నా" అని సీఎం అన్నారు.

**యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి: కేటీఆర్**

అనంతరం కేటీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చర్చను సమర్థిస్తున్నట్లు తెలిపారు. "విభజన సమయంలో తెలంగాణ హక్కుల కోసం ఎంతో పోరాడాం. మోదీ సర్కారుపై తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశాం. రాష్ట్ర హక్కులు ఎవరు హరించినా వారి మెడలు వంచుతాం. యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి. దిల్లీ తత్వం ఇంతకాలానికి కాంగ్రెస్‌కు బోధపడింది. భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మీకేం ఇబ్బంది? కేంద్ర వివక్షను ఎండగట్టడంలో మేం సహకరిస్తాం. గతంలో కేంద్రం సాయం చేయకపోయినా ఎంతో అభివృద్ధి చేశాం. రేవంత్ రెడ్డి కష్టపడే ఈ స్థాయికి చేరుకున్నారు. చిన్నవయసులోనే సీఎం అయ్యారు. కేంద్రం తెచ్చిన అన్ని బిల్లులకూ మేం మద్దతివ్వలేదు. దళితుడు రాష్ట్రపతి, తెలుగు బిడ్డ ఉపరాష్ట్ర అభ్యర్థులుగా అయ్యే సమయంలో మద్దతిచ్చాం. కేసీఆర్‌ను కాదు.. ధైర్యముంటే మోదీని తిట్టండి. ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు చేద్దాం. ఎన్నికల తర్వాత నాలుగున్నరేళ్లు ప్రజల గురించి ఆలోచిద్దాం. ఏం చేసినా బహిరంగంగానే చేశాం.. చీకటి ఒప్పందాలు మాకు అలవాటు లేదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వకుంటే మేమేం చేస్తాం?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: భట్టి**

తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. "హైదరాబాద్ పవర్ సర్కిల్‌ను ప్రైవేటు వాళ్లకు ఇస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఎవరో పత్రికల్లో రాసినదాన్ని పట్టుకుని సభలో మాట్లాడితే ఎలా? కేటీఆర్ సభతోపాటు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస వాళ్లలా ఏది పడితే అది చేసేవాళ్లం కాదు. సింగరేణి అంశంపై చర్చించేందుకు మేం సిద్ధం" అని భట్టి స్పష్టం చేశారు.

## బడ్జెట్ ప్రసంగంలో అన్ని రాష్ట్రాల పేర్లనూ ప్రస్తావించలేం

మొదటి పేజీ తరువాయి...

ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రూ. 48.21 లక్షల కోట్ల అంచనాలతో వార్షిక పద్దును ఉభయ సభల ముందుకు తీసుకెళ్లారు. అయితే, కేంద్ర వార్షిక బడ్జెట్‌పై విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2024 బడ్జెట్ వివక్షపూరితంగా ఉందని, విపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిందని ధ్వజమెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో విపక్షాల ఆరోపణలకు విత్త మంత్రి నిర్మలమ్మ ధీటుగా బదులిచ్చారు. రాజ్యసభలో ప్రసంగించిన నిర్మలమ్మ బడ్జెట్‌లో ఏ రాష్ట్రాన్నీ విస్మరించలేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రసంగంలోనే అన్ని రాష్ట్రాల పేర్లను చెప్పలేమంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 'కేంద్రం ప్రవేశపెట్టే ప్రతీ బడ్జెట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లనూ ప్రస్తావించే అవకాశం రాదు. నేను చాలా రాష్ట్రాల పేర్లు చెప్పలేదని.. కేవలం రెండు రాష్ట్రాల గురించి మాట్లాడానని మల్లికార్జున ఖర్గే గారు అన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ చాలా కాలం అధికారంలో ఉంది. వాళ్లు చాలా భిన్నమైన బడ్జెట్‌లను సమర్పించారు. ప్రతి బడ్జెట్ ప్రసంగంలోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లూ ప్రస్తావించే అవకాశం మీకు లభించదని స్పష్టంగా తెలుసు' అంటూ నిర్మలమ్మ గట్టి కౌంటర్ ఇచ్చారు. బడ్జెట్ ప్రసంగంలో ఒక నిర్దిష్ట రాష్ట్రం పేరును ప్రస్తావించని మాత్రానా.. ఆ రాష్ట్రానికి కేంద్రం నిధులు వెళ్లవా..? అని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. మహారాష్ట్రలోని వందవన్‌లో అతి పెద్ద ఓడరేవును ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. కానీ, నిన్నటి తన బడ్జెట్ ప్రసంగంలో మహారాష్ట్ర పేరును ప్రస్తావించలేదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో మహారాష్ట్ర పేరు చెప్పనందుకు ఆ రాష్ట్రాన్ని విస్మరించినట్లా?.. అలా అని ఆ రాష్ట్రం తమను కేంద్ర విస్మరించిందని భావిస్తోందా..? అని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టుకు రూ.76 వేల కోట్లు ప్రకటించినట్లు ఈ సందర్భంగా నిర్మలమ్మ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నాయని దుయ్యబట్టారు

## సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి...



సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ గురించి పలుమార్లు ప్రస్తావించటం గమనార్హం. కేంద్రంపై నిరసన వ్యక్తం చేసే విషయంలో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఢిల్లీలో దీక్ష చేయాలంటూ రేవంత్ రెడ్డి డిమాండ్ చేయగా.. దానికి హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. అన్ని తామే చేస్తే.. సీఎంగా మీరేం చేస్తారంటూ ప్రశ్నించారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఆయన కేబినెట్ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. దానికి స్పందించిన రేవంత్ రెడ్డి.. కేసీఆర్ ఢిల్లీకి వస్తే.. తాను దీక్ష చేసేందుకు సిద్ధమన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధుల సాధన కోసం దీక్షకు కూర్చుందామన్నారు.. తెలంగాణకు నిధులు తెచ్చుడో సచ్చుడో.. డేట్ ఫిక్స్ చేయండి, కేసీఆర్‌ను తీసుకుని రండి అంటూ ఛాలెంజ్ చేశారు.

## నేపాల్‌లో కుప్పకూలిన విమానం

న్యూఢిల్లీ, జులై 24 (ప్రభాత ఉదయం): పొరుగు దేశం నేపాల్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. టేకాఫ్ అవుతున్న సమయంలో ఓ విమానం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోఖారాకు బయల్దేరింది. విమానం రన్‌వేపై టేకాఫ్ అవుతున్న సమయంలో స్కిడ్ అయ్యి రన్‌వే అంచున ఉన్న పెన్సింగ్‌ను ఢీ కొట్టి కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో 19 మంది సాంకేతిక సిబ్బంది ఉన్నట్లు నేషనల్ మీడియా తెలిపింది. అందులో 18 మంది ప్రాణాలు కోల్పోగా.. పైలట్ 37 ఏళ్ల మనీశ్ షక్య ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పైలట్‌ను వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఇక ఇప్పటి వరకూ 13 మంది మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదం అనంతరం విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

## బడ్జెట్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి నిరసన

మొదటి పేజీ తరువాయి...

బడ్జెట్ ఇది అని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సహా కూటమి పార్టీల నేతలంతా నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో చాలా మందికి అన్యాయం జరిగిందని ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'ఇది అన్యాయం. న్యాయం కోసం దీనిపై మేము పోరాడుతాం' అని తెలిపారు. ఈ మేరకు నేతలంతా ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా

**ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి రాష్ట్రానికి నిధులు తేలేకపోయారు...**

**తెలంగాణా కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి.. ఇది మోదీ కుర్చీ బచావో బడ్జెట్...**

**సబ్ కా సాత్ పెద్ద బోగస్.. వికసిత్ భారత్ లో తెలంగాణ లేదా...?**

**తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి పై నిరసన తెలుపుతాం....**

**కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర ఆన్యాయంపై ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ ఆగ్రహం...**



కూకట్‌పల్లి, జూలై 24 (ప్రభాత ఉదయం) కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని రాష్ట్రానికి పెద్దగా నిధులు కేటాయించపోవడం పై తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ తీవ్ర స్థాయిలో అగ్రహారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఢిల్లీ వెళ్లి మోదీ ని నిధులు కేటాయించలని అడిగినా మోడీ సర్కారు తెలంగాణా పై దయ చూపలేదన్నారు. తెలంగాణ పై కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంభిస్తుందని, బడ్జెట్ లో రాష్ట్ర ప్రాజెక్ట్ లకు మొండి చేయి చూపిందని, కేంద్రం తెలంగాణా పై వివక్ష చూపుతుందని రాష్ట్రం లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీ లు ఉన్నా తెలంగాణాకు బడ్జెట్ కేటాయించకపోవడం పై ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. తెలంగాణా పై బీజేపీ ఎంపీలకు ప్రేమ ఉంటే కేంద్రం తో కొట్లాడి తెలంగాణా కు నిధులు తేవాలని, లేనిపక్షంలో రాజీనామా చేయాలన్నారు. మిత్రపక్షం ఆంధ్రప్రదేశ్ కు బడ్జెట్ లో నిధులు మల్లింపుకుంటుంటే మన రాష్ట్ర బీజేపీ ఎంపీ లు అసలు ఏమి పట్టించుకోవడం లేదని అన్నారు. తెలంగాణ కు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు.




# హైదరాబాద్‌లో గాడిద గుడ్డు ఫ్లెక్సీలు

**బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై వినూత్న రీతిలో నిరసన**

హైదరాబాద్, జులై 24 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంటులో ఆర్థిక బడ్జెట్ 2024-25 ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్ బీహార్, ఏపీ రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఆ రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేసింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు,విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్డీయేలో భాగంగా ఉన్న పార్టీలకు సంబంధించిన రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం ఎక్కువ నిధులు కేటాయించిందని .. మిగతా రాష్ట్రాలను పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి . కాంగ్రెస్ అగ్ర నేతలు ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు ఇతర ముఖ్య నేతలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీరియస్ అయ్యారు.ఇది ఇలా ఉంటే.. నగరంలో పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ బ్యానర్లను ఏర్పాటు చేసి నిరసనను వ్యక్తం చేసింది. 'బీజేపీకి తెలంగాణ 8 ఎంపీ సీట్లు ఇస్తే.. కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ తెలంగాణకు ఏమిచ్చింది..? గాడిద గుడ్డు' అంటూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై వినూత్న రీతిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిరసన తెలిపింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, స్థానికులు ఆ బ్యానర్లను ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఈ బ్యానర్లు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి

# అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మారుతున్న సమీకరణాలు

డెలావెర్, జులై 24 (ప్రభాత ఉదయం): అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది నవంబర్ 5న జరుగనున్నాయి. రిపబ్లిక్ పార్టీ తరఫున మరోసారి డోనాల్డ్ ట్రంప్ బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో డెమొక్రాట్ అభ్యర్థిగా భారత సంతతికి చెందిన కమలా హారిస్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. కమలా హారిస్ బరిలో నిలుస్తుండడంతో ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. తాజాగా ఓ సర్వే కీలక రిపోర్ట్ విడుదల చేసింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కంటే కమలా హారిస్‌కే విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. ఐపీఎస్ఓఎస్ నేషనల్ పోల్స్ ప్రకారం.. ట్రంప్ కంటే కమలా హారిస్ ముందంజలో నిలిచారు. బైడెన్ అధ్యక్ష ఎన్నికల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన అనంతరం సోమ, మంగళవారాల్లో ఈ పోల్ జరిగింది. ఆదివారం బిడైన్ ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 27న డోనాల్డ్ ట్రంప్‌తో జరిగిన చర్చల తర్వాత బైడెన్ పోటీ నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ నేతల నుంచే



డిమాండ్లు వినిపించాయి. తాజాగా నిర్వహించిన సర్వేలో డోనాల్డ్ ట్రంప్‌కు 42శాతం మంది మద్దతు తెలుపగా.. కమలా హారిస్‌కు 44 మందిశాతం అండగా నిలిచారు. దాంతో డెమోక్రటిక్ అభ్యర్థిత్వానికి అవసరమైన మద్దతును కూడగుడుతన్న సమయంలో సర్వేలో ఉపాధ్యక్షురాలికి అనుకూలంగా సర్వే ఫలితం వచ్చింది. ఇంతకు ముందు ఈ నెల 15-16 మధ్య జరిగి సర్వేలో ట్రంప్ 44శాతం.. జులై 1-2 మధ్య జరిగిన సర్వేలో డోనాల్డ్ ఒకశాతం పాయింట్లతో ముందంజలో నిలిచారు. ప్రస్తుతం కమలా హారిస్ మద్దతు పెరుగుతోందని జాతీయ సర్వేలు చెబుతున్నాయి. పోల్‌స్టర్ టోనీ ఫాబ్రిజియో మాట్లాడుతూ హారిస్ ప్రజాదరణ పెరగడం కొంతకాలం పాటు కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన జాతీయ సర్వేల్లో 56శాతం మంది ఓటర్లు కమలా హ్యారిస్ అభ్యర్థిత్వంపై ఆసక్తి చూపించారు. మానసికంగా ధృడంగా ఉండగలరని.. సవాళ్లను ఎదుర్కోగల సామర్థ్యం ఆమెకు ఉందని అమెరికన్లు భావిస్తున్నారు. అయితే, 78 నుంచి 49శాతం మంది ఓటర్లు ట్రంప్‌పై సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం 22శాతం మంది మాత్రమే బిడైన్‌కు ఇదే అభిప్రాయాన్ని ఉందని తెలిపారు. పీబీఎస్ న్యూస్ సర్వే ప్రకారం.. మొత్తం అమెరికన్లలో 87 శాతం మంది ఎన్నికల రేసు నుంచి తప్పుకోవాలని బిడెన్ తీసుకున్న నిర్ణయం సరైందేనని భావించారు. 41 శాతం మంది బిడెన్ నిర్ణయంతో నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో డెమొక్రాట్‌ల గెలుపు అవకాశాలను పెంచుతుందని అంచనా వేస్తున్నారు. ఇక ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అధ్యక్ష అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. అధ్యక్ష అభ్యర్థికి కావాల్సిన 1,976 కంటే ఎక్కువగానే ప్రతినిధులు ఆమెకు మద్దతును ప్రకటించారు. ఇటీవల డెలావెర్‌లో ప్రచార ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. బిడైన్ ప్రచార బృందంతో భేటీ అయ్యారు. అదేబృందంతో కలిసి పని చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికలకు సమయం మూడునెలలే ఉందని.. గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డోనాల్డ్ ట్రంప్‌పై మండిపడ్డారు.

## స్వార్థంతో పార్టీ మారిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు

# ప్రజలే బుద్ధి చెబుతారు

**బిఆర్ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి**

**బీఆర్ఎస్‌లో కార్యకర్తలే సైనికులు..వారినే నాయకులుగా తీర్చిదిద్దుదాం:**

**మణికొండలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు**

**రాష్ట్ర బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి**



మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి టీఆర్ఎస్ శ్రేణులకు పంచి పెడుతున్న యువనేత కార్తీక్ రెడ్డి

గండిపేట్,జులై 24 (ప్రభాత ఉదయం) పార్టీ మారిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాజీనామా చేసి తిరిగి ప్రజాక్షేత్రంలో సత్తా చాటుకోవాలని రాష్ట్ర బీఆర్ఎస్ యువ నాయకుడు,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి అన్నారు.యంగ్ డైనమిక్ లీడర్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను మణికొండలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో రాష్ట్ర బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.అనంతరం పట్లోళ్ల కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ...స్వార్థంతో పార్టీలు మారిన ఎమ్మెల్యేల వల్ల తమకు నష్టం లేదని కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని కార్తిక్ రెడ్డి తెలిపారు. పార్టీ అనేది నాయకులను సృష్టిస్తుందని, నాయకులు పార్టీలోకి వచ్చి పోతుంటారని పేర్కొన్నారు.కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం రాదని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ సైతం అదేవిధంగా ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేటీఆర్ యువతకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనుడు కేటీఆర్ అని పేర్కొన్నారు.కేటీఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కార్తీక్ రెడ్డి ఆకాంక్షించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కేటీఆర్ అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు.భారతదేశంలో తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా ఐటీ రంగానికి ప్రత్యేక గుర్తింపు రావడానికి కారణం కేటీఆర్ అని చెప్పారు.హైదరాబాద్ ఇంత వేగంగా డెవెలెప్మెంట్ కావడానికి కేటీర్ కృషిని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ,డాక్టర్ కర్నాటి శ్రీనివాస్,మణికొండ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్,కౌన్సిలర్లు వసంత్ రావ్,చౌహాన్,ఆలస్యం నవీన్ కుమార్,మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి,సీనియర్ నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, డి.నర్సింగ్ రావు,అందె లక్ష్మణ్ రావు,ఉపేంద్రానాథ్ రెడ్డి,రాజేంద్ర ప్రసాద్, కీర్తిలతా గౌడ్,విజయలక్ష్మి, శ్రీకాంత్,షేక్ అరిఫ్,రామ సుబ్బారెడ్డి,సురేఖ,యువ నాయకులు మహేష్,బాబు,దిలీప్, కిరణ్, భాను, బాలాజీ,తిరుపతి,ఎల్లాస్వామి తదితర పాల్గొన్నారు.



ఐ వీ ఎఫ్ విధానం ద్వారా ఆడ బిడ్డకు జన్మనిచ్చిన తల్లితో డాక్టర్ జ్యోతిష్మతి శర్మ

## నేడు ప్రపంచ ఇన్ విట్రో ఫెర్టిలైజషన్ (ఐవీఎఫ్) దినోత్సవం

**చెవిటి - మూగ జంటకు ఐ వీ ఎఫ్ ద్వారా సంతానం కలుగచేసిన మైలార్ దేవ్ పల్లి శ్రీ రాఘవేంద్ర ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ జ్యోతిష్మతి శర్మ**

రాజేంద్రనగర్, జూలై24(ప్రభాత ఉదయం): చెవిటి, మూగ జంటకు ఐ వీ ఎఫ్ తర్వాత ఒక సాధారణ బిడ్డ కు జన్మనిచ్చారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి శ్రీ రాఘవేంద్ర ఫెర్టిలిటీ సెంటర్ లో జరిగింది. వివరాలలోకి వెళితే..... ఐ వీ ఎఫ్ తో సంతానోత్పత్తి చికిత్స తర్వాత గర్భం దాల్చి, ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించిన అరుదైన చెవిటి మూగ జంట యొక్క కేసు నివేదికను పరిశీలిస్తే.... ఈ జంట వివాహం 3 సంవత్సరాలు అయ్యింది. వారికి ఒకసారి ఆకస్మిక గర్భస్రావం జరిగింది. దీంతో ఆ దంపతులను సంతానోత్పత్తి నిపుణులు, మైలార్‌దేవ్‌పల్లిలోని శ్రీ రాఘవేంద్ర ఫెర్టిలిటీ సెంటర్‌లో డాక్టర్ జ్యోతిష్మతి శర్మ పరిశీలించారు. పరీక్షలు చేశారు. భార్యకు గుడ్ల సంఖ్య తక్కువగా ఉన్నట్లు పరీక్షలలో తేలింది. అదనంగా, భర్త యొక్క సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులలో చెవిటి మూటిజం ఉంది. ఈజంట స్వీయ గేమేట్‌లతో ఐవీఎఫ్ ప్రయత్నించ డానికి ఆసక్తి చూపారు. ప్రారంభ దశగా, సీసీఎంబీ లో డాక్టర్ కార్తీక్ భరద్వాజ్ ఆ ఇద్దరు దంపతుల జన్యు మూల్యాంకనం చేశారు. భర్తలో ఆటోసోమల్ రిసెసివ్ కండిషన్ గుర్తించబడింది (ఇది శిశువులో చెవిటి మూటిజంకు దారితీయదు). భార్యలో జన్యుపరమైన కారణం ఏదీ గుర్తించబడలేదు. స్వీయ ఐవీఎఫ్‌తో గర్భందాల్చే అవకాశాలు వారి విషయంలో దాదాపు 20 శాతం ఉండవచ్చని జంటకు సలహా ఇచ్చారు. ఐ వీ ఎఫ్ స్టిమ్యులేషన్ ప్రారంభించబడింది . రెండు గుడ్లు తిరిగి పొందబడ్డాయి. రెండు శిశువులు ఐ వీ ఎఫ్ ద్వారా అభివృద్ధి చేయబడ్డాయి. పిండ మార్పిడి జరిగింది. ఫలితం సానుకూలంగా వచ్చింది. ఆమె గర్భాన్ని డాక్టర్ జ్యోతిష్మతి , డాక్టర్ రాధా రాణి జాగ్రత్తగా పర్యవేక్షించారు. ప్రోమ్ (వాటర్ బ్రేకేజ్) దృష్ట్యా, ఎమర్జెన్సీ ఎల్ ఎస్ సీ ఎస్ చేయబడింది. ఆరోగ్యకరమైన ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఇప్పుడు, పిల్లల వయస్సు నాలుగు నెలలు . అన్ని ప్రాథమిక పరిశోధనలు వినికిడి స్క్రీనింగ్ పరీక్షతో సహా పిల్లల సాధారణ అభివృద్ధిని వెల్లడించాయి. ఇది సైన్స్, ప్రకృతి యొక్క దయాదాక్షిణ్యాల కలయికతో సంతోషకరమైన ముగింపు. జన్యు, సంతానోత్పత్తి సమస్యలతో బాధపడుతున్న అనేక ఇతర జంటలకు విశ్వాసం కలిగించింది. చాలా మందిలో ఆశను అందిస్తుంది.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

## వారం రోజులపాటు ప్రమాద రహిత వారోత్సవాలు

బుద్వేల్, జూలై24(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ బుధవారం నుంచి వారం రోజులపాటు ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించనుంది. అందులో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ , రాజేంద్ర నగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ కిరణ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, ప్రమాదాల నివారణ కు ప్రతి డ్రైవర్ కృషి చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోను కావద్దన్నారు. పూర్తి ఏకాగ్రతతో బస్సులను నడపాలన్నారు. సెల్ ఫోన్ లో మాట్లాడకుండా డ్రైవింగ్ చేసినట్లయితే, మద్యం సేవించకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ , ఎస్ టి ఐ సుశీల తో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు



సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి

## కార్మిక హక్కులను కాల రాస్తే సహించేది లేదు

**రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్**

రాజేంద్రనగర్,జులై 24 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల ఫేస్ స్కానర్ హాజరు పేరుతో కార్మికుల జీతాలకు కోతలు విధిస్తున్నారనీ విధులు నిర్వహించిన కూడా టెక్నికల్ సమస్యలతో కార్మికుల జీతాలు కట్ అవుతున్నాయని రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మండిపడ్డారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు కార్మిక హక్కులను కాల రాస్తే సహించేది లేదంటు మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ కు వినతి పత్రం అందజేశారుఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధర్నాను ఉద్దేశించి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్,కార్మికులు పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్నారు.మున్సిపల్ సర్కిల్ లో 5 డివిజన్లో ప్రజల ఆరోగ్యాల పట్ల నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బందిని అడుగడుగున వివక్షతకు గురవుతున్నారని ఆవేదన చెందారు.అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు నాలుగు వీక్లీ సెలవులు ఇస్తున్నారు.పారిశుద్ధ్య కార్మికులకు ఫేస్ స్కానర్ వచ్చిన తర్వాత నుండి ఒక వారంలో ఆరు రోజులు తప్పనిసరిగా విధులు నిర్వహిస్తేనే వీక్లీ సెలవు మున్సిపల్ అధికారులు ఇస్తామంటు చెప్పడం బాధాకరమన్నారు.ఒకవేళ వారంలో ఏదో ఒక రోజు రాకపోతే వీక్లీ సెలవు కూడా ఆఫ్ సెంట్ కింద వేసి రెండు రోజుల వేతనాలు కట్ చేయడంపై అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కుల చట్టాలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు.పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వవలసిన వేతనంతో కూడిన వారాంతపు సెలవులు గతంలో ఇచ్చినట్లు ఇవ్వకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పండుగ,నేషనల్, సి.ఎల్,ఈ.ఎల్, సెలవులు కూడా అమలు చేయాలన్నారు.విధులు నిర్వహిస్తున్న సమయంలో కార్మికులు మరణిస్తే 25 లక్షల ఎక్స్ గ్రేషియా, దహన సంస్కారాల ఖర్చులకోసం 30 వేల రూపాయలు ఇవ్వాలని పేర్కొన్నారు. మున్సిపల్ లో పనిచేయు కార్మికులందరికీ వి.డి.ఎ తో కూడిన వేతనాలు ఇవ్వాలని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల కార్యదర్శి పి.ఆనంద్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్ఎఫ్ఏ లు అనిల్, ఎల్లప్ప,చందు,వినయ్,శ్రీకాంత్,జాషువా, ఏ.రాజు, జి.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల నివారణకు

## ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ శశాంక**



రంగారెడ్డి ప్రతినిధి,జులై 24(ప్రభాత ఉదయం)వన మహోత్సవం,మహిళా శక్తి,వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ శశాంక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, స్పెషల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వన మహోత్సవం సందర్భంగా వర్షాకాలంలోనే మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.మండల అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు ఎప్పుడు అందుబాటులో ఉండి గ్రామంలో రోజువారీ నిర్వహించే పనులను విధిగా నిర్వహించాలని ఆదేశించారు. త్రాగునీరు,వీధి దీపాలు,పారిశుద్దంపై ప్రతి రోజు నివేదికను పంపించాలని డీపీఓకు సూచించారు.అంతే గాకుండా అధికారులు గ్రామాల వారీగా సందర్శించాలన్నారు.వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్,పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా పరస్పర సమన్వయంతో పని చేస్తూ,సీజనల్ వ్యాధుల నివారణకు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు.ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ,అవగాహన కల్పించాలని సూచించారు.పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని,ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని,దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని,వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.డెంగ్యూ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని,పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని,అన్ని ఇండ్లు,సంస్థలలో చేపట్టి, నిలువ నీటినంతటిని బయట పారబోసి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాట్లు చేయాలని,మైక్రో ఎంటర్ ప్రైజెస్,మీ సేవా కేంద్రాలు, స్టిచింగ్,మహిళా శక్తి క్యాంటీన్,జిల్లా,మండల, గ్రామాల వారీగా మహిళా సమైక్య సంఘాల గ్రూప్ లను ఎక్కువగా ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ ల ఏర్పాటు పారదర్శకంగా ఉండాలని అన్నారు.బస్టాండ్ సమీపంలో జనాలు ఎక్కువగా రద్దీ ఉన్నచోట గుర్తించి క్యాంటీన్ లు ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత,జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి,డీపీఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి,సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరి దేవి,జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆరాంఘర్ నుంచి కొండాపూర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు



బుద్వేల్, జూలై24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బద్రీ నారాయణ రాజేంద్ర నగర్ పరిసర ప్రాంత ప్రజలకు శుభవార్త తెలిపారు. . ఈనెల 25 నుండి ఆరాంఘర్ నుండి కొండాపూర్ కు 215 నెంబర్ రెండు ఆర్డినరీ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రాజేంద్రనగర్ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు





కళాశాల ప్రిన్సిపాల్ కు వినతి పత్రం అందజేస్తున్న చిలుకూరు సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల పేరెంట్స్ కమిటీ

## చిలుకూరు పేరెంట్స్ కమిటీ కార్యవర్గం ఎన్నిక

మొయినాబాద్ జూలై 24 (ప్రభాత ఉదయం) మండల పరిధిలోని చిలుకూరులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర,కళాశాల పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పేరెంట్స్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది . ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ అధ్యక్షులుగా బేగరి రాజు, ఉపాధ్యక్షులు పొడిదల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి,జోగు శ్యామలయ్య సహాయ కార్యదర్శి సుమా వేణి కోశాధికారి సండి మహేష్, కార్యదర్శులు, కృష్ణారావు, జింద్రల సాయన్న, ఉషన్నగారి సుజాత కార్యవర్గ సభ్యులు,పమేనా నరసింహులు, వెంకటస్వామి, పానగారి యాదగిరి, సంజీవ, జంగయ్య, హుజూర్,శ్రీకాంత్, నక్క మాణిక్యం, దశరథ్ జయ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో చిలుకూరు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు వైస్ ప్రిన్సిపాల్ శౌరి రాజు, పండరి పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతనంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల%ఌ% కళాశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు బేగరి రాజు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో వరుసగా మూడవసారి అధ్యక్షులుగా నియమించినటువంటి కమిటీ సభ్యులకు ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు స్కూల్ డెవలప్మెంట్ కమిటీకి పూర్తి సహకారం అందిస్తానని అన్నారు చదువు ఉంటేనే సమాజాన్ని ప్రశ్నించగలమని చదువు ఉంటే నీ సమాజంలో బతకగలమని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన విధంగా పే బ్యాక్ ది సొసైటీ అనే నినాదాన్ని అనుసరిస్తామని అన్నారు.

### గురుకుల పాఠశాలలకు

## సొంత భవనాలు నిర్మించాలి

**మౌలిక వసతులు కల్పించాలని మంత్రికి టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మీ నివాస్ వినతి..**



బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీ నివాస్

రాజేంద్రనగర్,జులై 24(ప్రభాత ఉదయం): రాష్ట్ర రవాణా,వెనుకబడిన తరగతుల శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ను తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు,అలాగే వసతి గృహాలకు సొంతభవనాల నిర్మించాలని మంత్రి దిష్టికి తీసుకెళ్లారు.చాలా ప్రాంతాల్లో వసతి గృహ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, అంతేకాకుండా మౌలిక సదుపాయాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.చాలా హాస్టల్లో టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.తక్షణమే గురుకుల పాఠశాల సమస్యల పరిష్కరించాలని,ప్రతి హాస్టల్ కు సొంత భవనాలు నిర్మించాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు,వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని,పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ పేమెంట్ ని విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను మీసాల లక్ష్మీ నివాస్ కోరారు.



మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు అక్కెం రాఘవేందర్ యాదవ్, ముఖీద్ చంద్

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేటి యువతకు స్ఫూర్తి

**మైలార్ దేవులపల్లిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..హాపీ బర్త్‌డే రామన్న..**

**డివిజన్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్**

రాజేంద్రనగర్,జూలై 24(ప్రభాత ఉదయం) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి,సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు మైలార్ దేవులపల్లి డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు.కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని డివిజన్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మొగల్స్ కాలనీ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.కేక్ కట్ చేసి,స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు.కేటీఆర్ కు బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన వేడుకలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు అబ్దుల్ ముఖీద్ చందాతో కలిసి అక్కెం రాఘవేందర్ యాదవ్ మాట్లాడుతూ... నేటి యువతరానికి కేటీఆర్ ఆదర్శమని తెలిపారు. ఐటీ రంగంలో తెలంగాణను మేటిగా నిలిపిన దార్శనికుడు కేటీఆర్ అని అన్నారు.కెటిఆర్ ఎల్లప్పుడూ ఆరోగ్యంగా,సంతోషంగా ఉండాలని, మరెన్నో ఉన్నతమైన స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎంతో చురగ్గా పాల్గొన్నారు.అలాగే పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చేందుకు ఎంతో కృషి చేశారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఓడినా,గెలిచినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలపై పోరాడుతుందన్నారు.అన్ని వర్గాల అభ్యున్నతికి కేటీఆర్ అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంత వేగంగా అభివృద్ధి కావడానికి కేటీఆర్ కృషిని గుర్తు చేశారు.ఇలా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత హైదరాబాద్‌కు అనేక ఐటీ కంపెనీలను తీసుకువచ్చి యువతీ యువకులకు ఉపాధి కల్పించిన ఘనత కేటీఆర్ కే దక్కిందన్నారు.మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిపారని గుర్తు చేశారు.ఇలాంటి గొప్ప నాయకత్వంలో పనిచేస్తుండడం ఆనందంగా ఉందన్నారు.కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బండా రాజేష్ యాదవ్,నోముల రాము యాదవ్,గుమ్మడి కుమార్,మైసిరెడ్డి,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు

# వక్స్ బోర్డు భూమిగా చేయించుకుంటారు



మొయినాబాద్ జులై 24( ప్రభాత ఉదయం): మండల పరిధిలోని చిలుకూరులో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఘర్షణ సందర్భంగా ఈరోజు బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు అలాగే సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఈనెల 30 వరకు మొయినాబాద్ లోని చిలుకూరు ఆలయ పరిసర ప్రాంతంలో 144 సెక్షన్ విధించడం జరిగింది బజరంగ్ దళ్ , హిందూ సంఘాలు ఉదయం చిలుకూరు ఆలయ పరిసరాలలో ధర్నాలు నిర్వహించారు ఈ నేపథ్యంలో చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ తో పోలీసు వారు సర్దిచెప్పి బజరంగ్దళ్ చేస్తున్న ధర్నాలు విరమింప చేయడం జరిగింది ఈ ఘర్షణకు ముఖ్య కారణమైన 133 సర్వేనెంబర్ లో గల నాలుగు గుంటల భూమిలో ఇంతకుముందు ఉన్న గుర్రాల శాలను కూల్చివేయడంతో ప్రారంభమైందని చెప్పొచ్చు కానీ ముస్లింలు మాత్రం అది గుర్రాల శాల కాదు అది మసీదు అని కాబట్టి అక్కడ ఎక్కడైతే మసీదు కూల్చారో అక్కడనే కొత్తది మసీదు నిర్మించాలని వారు ప్రభుత్వ అధికారులకు తెలపడంతో ఎలాంటి ఎంక్వయిరీ లేకుండా మసీదును నిర్మించాలని ఎమ్మార్వో దగ్గరుండి మరి మసీదు నిర్మాణానికి పూనుకోవడం జరిగింది కానీ రికార్డులు పరిశీలిస్తే 1955-78 వరకు ఈ భూమి ప్రభుత్వ భూమిగా 1978 లో కబ్రస్తాన్ (సమాధుల) భూమిగా,ఆ తర్వాత ఇది1989 లో గెజిట్ నుంచి వక్స్ బోర్డ్ కింద పడిందని రికార్డుల ద్వారా తెలుస్తుంది. అలాగే అక్కడ ఎలాంటి మసీదు లేదని చుట్టుపక్కల గ్రామ ప్రజలు తెలుపుతున్నారు కాబట్టి ఇలాంటి చర్యలు జరగకుండా, అలాగే ఎలాంటి ప్రార్థన స్థలాలు నిర్మించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు కోరుతున్నాయి అతి పవిత్రమైన చిలుకూరు బాలాజీ ఆలయ పరిసర ప్రాంతాలలో రెండు కిలోమీటర్ల మేర రేడియేషన్ పరిధిలో ఎలాంటి అన్యమతస్తుల ప్రార్థనా స్థలాలు కానీ, మసీదులు కానీ నిర్మించవద్దని తిరుపతి క్షేత్రానికి ఎలాంటి జీవో ఉందో అలాంటి జీవోను కూడా చిలుకూరు బాలాజీ ఆలయానికి అనుమతించాలని రంగరాజన్ డిమాండ్ చేశారు కాబట్టి ఇక్కడ ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతాలను వక్ఫుర్డ్ కింద మార్చడం చాలా దారుణమని ఇంకా ఇలాంటివి ఎక్కడైనా ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకొని అన్నింటిని బయటకు తీయాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదని అలాంటి భూములను ఏమైనా ఉంటే ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ భూమిగా మార్చి దేశ ప్రజల ప్రయోజనాల గురించి వాడాలని ప్రజలు కోరుతున్నారు



## కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ

# నిరుపేదలకు అండగా ఉంటుంది

**కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు**

కూకట్‌పల్లి, జూలై 24 (ప్రభాత ఉదయం) నిరుపేదలకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ లోని జనతా నగర్ కు చెందిన ఎపురాల కృష్ణవేణి భర్త ఎపురాలో లక్ష్మణ్ కృష్ణవేణి గత కొద్ది కాలంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో బాధపడుతు పంజాగుట్ట లోని నిమ్స్ హాస్పల్ లో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ల సూచన మేరకు సర్జరీ చేయవలసిందిగా చెప్పడంతో గొట్టిముక్కల వేంకటేశ్వర రావు ని కలిసి పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేయించి రూ. 65వేల(అక్షరాల అరవే ఐదు వేల రూపాయలు) మంజూరు చేయించారు. ఆ సంబంధిత చెక్కును కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్, గొట్టిముక్కల వేంకటేశ్వర రావు చేతుల మీదుగా వారి కుమారుడు పవన్ కు అందించారు. ఈ కార్యక్రమంలో మేకల రమేష్, పాతపల్లి సాయిరామ్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ రంగంలోకి

# ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుంది

**బాలాజీనగర్ డివిజన్‌లో ఘనంగా జరిగిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు**

కూకట్‌పల్లి, జూలై 24 (ప్రభాత ఉదయం)కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్భంగా ముసాపేట్ పార్టీ కార్యాలయం వద్ద బాలాజీ నగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ బాబురావు కేక్ కట్టింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ రంగంలో అగ్రగామిగా నిలిపి, తన ముందుచూపుతో హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్ది, తనదైన ముద్ర వేసుకున్న విజనరీ లీడర్, తెలంగాణ ప్రగతి కోసం నిరంతరం పరితపించే శ్రామికుడు మన కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, అనితా శ్రీపాద, అరుణా శెట్టి, లక్ష్మి రాజ్యం, పవన్ కుమార్, భూమండ్ల అశోక్, ముత్యపాగ శ్రీనివాస్, జాన్ మోసెస్, అంజి గౌడ్, ఈ.అశోక్, ఖదీర్ భాయ్, యాదుల్, ఖాజా పాషా, ఫయాజ్, భాస్కర్ రావు, పృధ్వీ రాజ్, రమేష్, జిమ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## హామీదుల్లా నగర్‌లో

# ఘనంగా బోనాల వేడుకలు

శంషాబాద్, జూలై 24( ప్రభాత ఉదయం) మండలంలోని హామీదులానగర్ గ్రామపంచాయతీ పరిధిలో బుధ వారం మైసమ్మ. పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఆషాడమాసంలో నిర్వహించే బోనాల వేడుకలను గ్రామస్తులందరూ కలిసిమెలిసి నిర్వహించుకున్నారు. పోచమ్మ మైసమ్మ దేవాలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు తలపై బోనాలు పెట్టుకుని తరలివచ్చారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా పలువురు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ద్వీప కొమ్మలు నీళ్ల బిందెలతో అమ్మవారికి నైవేద్యాలు తీర్థప్రసాదాలు సమర్పించుకున్నారు. పలువురు మేకపోతులను కోడిపుంజులను అమ్మవారికి బలి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్. శంషాబాద్ మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవులపల్లి శ్రీనివాస్. మాజీ ఉప సర్పంచ్ మాదవి యాదగిరి మాజీ వార్డ్ మెంబర్ సురేందర్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పూజా జ్యువెలరీ బంగారం దుకాణం షట్టర్ తాళం విరగొట్టి దోపిడీకి ప్రయత్నించారు

**స్టీలు దుకాణంలో దోపిడీకి పాల్పడ్డారు. టీవీతోపాటు ఇతర విలువైన సామాగ్రిలను దొంగలించి తీసుకెళ్లారు దుండగులు**

మొయినాబాద్ జూలై 24 ( ప్రభాత ఉదయం) మండల కేంద్రంలో దోపిడి దొంగల బీభత్సం,రెండు దుకాణాలలో దొంగతనం దర్జాగా కారులో వచ్చి సిమెంటు మరియు స్టీలు దుకాణంలో దోపిడీకి పాల్పడ్డారు. టీవీతోపాటు ఇతర విలువైన సామాగ్రిలను దొంగలించి తీసుకెళ్లారు. అలాగే మండల కేంద్రంలో పూజా జ్యువెలరీ బంగారం దుకాణం షట్టర్ తాళం విరగొట్టి దోపిడీకి ప్రయత్నించారు. ఈ ఘటన రెండు ఉదయం 3 గంటలకు జరిగినట్లు తెలుస్తుంది పూజ బంగారం దుకాణంలో దొంగతనానికి ప్రయత్నించిన వీడియో విజువల్స్ సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి. లాంటివి మరల జరగకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు




## ప్రభుత్వం పేదలకు సంపూర్ణ వైద్యం అందిస్తోంది

**మెదక్ ఎమ్మెల్యే రోహిత్.. ఎల్ఓసి అందజేత**

మెదక్,జూలై24(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మెదక్ నియోజక వర్గంలోని మెదక్ మండలం రాజీపేట గ్రామానికి చెందిన లక్ష్మి నారాయణ గౌడ్ కు వైద్య చికిత్స కోసం 2 లక్షల రూపాయల ఎల్.ఓ.సి.నీ లక్ష్మీనారాయణ గౌడ్ ఆరోగ్య పరిస్థితి ని ఎమ్మెల్యే రోహిత్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి వెంటనే నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం బుధవారం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అందజేశారు.



వైద్యం కోసం ఎల్ ఓ సి అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



## జనసేన పార్టీ

# 4వ విడత సభ్యత్వం నమోదు

**ప్రారంభించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్**

కూకట్‌పల్లి, జూలై 24 (ప్రభాత ఉదయం)తెలంగాణలో ప్రారంభమైన జనసేన పార్టీ నాల్గవ విడత సభ్యత్వ నమోదును నూతన, రెన్యువల్ కార్యక్రమంలో భాగంగా కెపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ లో జనసేన పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ సభ్యత్వాన్ని నమోదుకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యకర్తలకు అండగా నిలబడే సత్కార్యం అని అన్నారు. కార్యకర్తకి ప్రమాదవశాత్తు కష్టము వచ్చినప్పుడు వారి కుటుంబాలను జనసేన పార్టీ ద్వార ఆదుకోవడమే ఈ సభ్యత్వం యొక్క లక్ష్యం అని తలిపారు. జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ భావాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్తే నమోదు కార్యక్రమము జనసేన పార్టీకి, ప్రజలకు ఒక వారధి లాగా ఉ ంటుందని అన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేయించుకోవాలని, జనసేన నాయకులు, వీర మహిళలు ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాముల అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి దయాకర్, కొల్లా శంకర్, సలాది శంకర్, సుంకర సాయి, పుప్పాల అంజి, వెంకట్, దాసరి వెంకట్, రాము, విష్ణు, పులగం సుబ్బు, ఆడవాల షణ్ముఖ, అనిల్, మారుతి, వెంకట్ నాయుడు, జన సైనికులు పాల్గొన్నారు.

## తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు

# ఇద్దరు కేంద్రమంత్రులున్నా రాష్ట్రానికి శూన్యం

**టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం**

కూకట్‌పల్లి, జూలై 24 (ప్రభాత ఉదయం) కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు ఇచ్చింది గుండు సున్నా అని, అంతా ఊహించినట్లుగానే కేంద్ర బడ్జెట్ లో ఏపీ, బీహార్ కు ప్రాధాన్యత దక్కిందని, ఏపీ విభజన హామీలకు కట్టుబడి ఉన్నామన్న కేంద్రం తెలంగాణ విభజన హామీల సంగతేమిటని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం విమర్శించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ హామీల ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరమని, బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, తెలంగాణకు కేటాయింపుల్లో బీజేపీ విఫలమైందని, బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. గత పదేండ్లలో బీజేపీ, బీఆర్ఎస్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసారని, ఇది పూర్తిగా పొలిటికల్ బడ్జెట్ అని, బీజేపీకి మద్దతిస్తున్నారనే ఏపీ, బీహార్ రాష్ట్రాలకు భారీ కేటాయింపులు చేశారని, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఇద్దరు కేంద్రమంత్రులున్నా రాష్ట్రానికి చేసిందేమీలేదని విమర్శించారు. ఆంధ్ర బీహార్ లకే ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తే మా తెలంగాణలో బీజేపీ ఎంపీలు ఏ మొహం పెట్టుకుని తిరుగుతారని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదాపై కేంద్రం ఈసారి కూడా మౌనం వహించిందన్నారు. బడ్జెట్ లో యువతను పూర్తిగా విస్మరించిందని దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణలోని పెండింగ్ అంశాల గురించి, పారిశ్రామిక పార్కుల కేటాయింపు, సింగరేణి ఐఐటీ హైదరాబాద్, మణుగూరు ప్లాంట్లకు నిధుల కేటాయింపు గురించి ఎప్పటిలాగానే ఏ మాత్రం ప్రస్తావన లేనేలేదని అసలు తెలంగాణ ఊసే లేదని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై మరోసారి వివక్షతను చాటుకుందని సత్యం శ్రీరంగం విమర్శించారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.